# జైలు కథలు 15

## "ఒకే దెబ్బకు..."

గేటువద్ద గంట గణగణమంటూఆగకుండా మ్రోగుతూంది. జైలు ఆవరణలోని వారంతా ఎవరి బ్లాక్స్‌లోకి వారు పరుగు తీస్తున్నారు. అలా గంట మ్రోగిందీ అంటే 'జర్తి' (చెకింగ్) జరుగబోతుందన్నమాట. ప్రతి బ్లాక్‌లో ప్రతి వొక్కరినీ పరీక్షిస్తారు. జైలు రూల్సు ప్రకారం నిషేధ వస్తువులు ఎవరివద్దా వుండరాదు. ఇది నెలకు రెండు మార్లైనా జరుగుతుంది. సిబ్బందితో మా బ్లాక్‌లోకి వచ్చారు జైలరు. విష్‌చేశాను. రిప్లయ్ చెప్పి "ఎంతమంది?" అన్నారు. "ఫార్టీ టు సార్!" అన్నాను. రెండు వరుసలుగా వున్న మమ్మల్ని లెక్కించి, "వాన్ ఎక్సెస్" అన్నారు. నేను అందరి మొఖాలు చూశాను. క్రొత్తగా కనుపించిన అతన్ని అడిగాను. "నీదే బ్లాక్?" "రెండు" ముక్తసరిగా సమాధానం చెప్పాడు. "మరి ఇందులోకి ఎందుకు వచ్చావు?" కాస్త గద్దించాను. "నాకు తెలియదు. అందరూ పరుగెడుతున్నారు. నాకేమీ అర్థం కాక ఇందులోకి వచ్చాను." వినయంగా జవాబిచ్చాడతను

మరలా గంట మ్రోగింది. అంటే "జర్తి" అయిపోయిందన్నమాట. నాకు అతన్ని గూర్చి తెలుసుకోవాలనిపించింది.

వయస్సు వూహించలేదు. నలభై వుండొచ్చు చదివినవాడిలా వున్నాడు. విషయం అడిగాను. మనిషి వొక్కసారిగా మారిపోయాడు. మొఖం క్రోధంతో నిండిపోయింది. "ఆ రాక్షసి....నన్ను....హత్యాపరాధంలో యిరికించింది." పిడికిళ్ళు బిగుసుకున్నాయి. "ఎవరు?" అన్నాను. "నా....భార్య...." పండ్లు కొరుకుతూ క్రోధాన్ని అంతా అక్షరాల్లో నింపి, వొక్కొక్క అక్షరమే వత్తి పలుకుతూ అన్నాడు.

* * *

సూరి మక్తల్ తాలూకా ఆఫీస్‌లో పని చేస్తుంటాడు. భార్య రాధ హెల్త్‌విజిటర్. వొక్కడేఐన కొడుకు మిలిటరీలోవున్నాడు. అందువల్ల అతని భార్య రమ అత్తమామల వద్దే వుంటోంది. సంసారం వొడుదుడుకులు లేకుండా సాఫీగా సాగిపోతూంది. రాధకి మహబూబ్‌నగర్ ట్రాన్స్‌ఫర్ అయింది. రమను సూరివద్దనే వదలి, వొంటరిగా మహబూబ్‌నగర్ వచ్చేసింది. రమ మామగారికి వండి వార్చుతూ మక్తల్‌లోనే వుంది. వొకనాడు బాగా త్రాగివచ్చిన సూరి మత్తు మైకంలో రమ నాశించాడు. భర్త దగ్గర లేకపోవడంతో వయసు కోర్కెకు తల వంచింది రమ.

మహబూబ్‌నగర్‌లో రాధ తనకంటే సుమారు ఏడెనిమిది సంవత్సరాలు చిన్నవాడైన యింటివారబ్బాయి సతీష్‌తో ప్రేమాయణం సాగించింది. రెండు నెలలు, ఎవరికీ ఎలాంటి యిబ్బందులు లేకుండానే జరిగిపోయాయి. సూరి ప్రయత్నించి, అతను కూడా మహబూబ్‌నగర్ ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. మనసు గద్దింపువల్ల కోడలికి దూరంగా వుండసాగాడు. కాని రాధకే దగ్గర కాలేకపోతున్నాడు. రాధ, సతీష్‌లకు యిదివరలా ఇల్లు ప్రేమమందిరం కాలేకపోతూంది, తరచూ కలుసుకోవటానికి వీలులేకపోతూంది. రాధలో యిదివరకు వున్న వుత్సాహంలేదు.నిస్త్రాణగావుంటోంది ఆమెలో మార్పుకు కారణం వూహించలేకపోయాడు సూరి.

రాధను యిదివరకటిలా కలుసుకోలేకపోతున్న సతీష దృష్టి రమ పై బడింది. మామ దూరంగా వుండటంతో రమ వంత పాడింది. వొకనాడు డ్యూటీకి వెళ్ళిన రాధ, తలనొప్పి వల్ల మధ్యలో యింటికి రావడంతో రమ, సతీష్‌ల వ్యవహారం బయటపడింది రాధ హృదయం మండింది. శరీరం కంపించింది. సతీష్ తనకు దూరంగా ఎందుకుంటున్నాడో గ్రహించింది.

మధ్యాహ్నం సూరి అన్నానికి వచ్చే సమయానికి ముందుగా, నిద్రిస్తున్న రమను గొడ్డలితో నరికింది రాధ. సూరి వచ్చిన వెంటనే ఏడ్పు నటించి తన చేతిలోని గొడ్డలి అతనికిచ్చింది. ఆ దృశ్యాన్ని చూసి భయంతో కంపించిపోతున్న సూరి, అనాలోచితంగా గొడ్డలి తీసికొన్నాడు. అంతే బయటకు వెళ్ళి "హత్య.... హత్య.... రక్షించండి" అని పెద్దగా కేకలు పెట్టింది. వచ్చిన యిరుగు, పొరుగువారికి తల నరుకబడిన రమ శవం, చేతిలో, రక్తంతో తడిసిన గొడ్డలితో సూరి కనుపించారు.

తరువాత మామూలే. పోలీస్ రిపోర్టు, కేసు. "గొడ్డలికర్రపై నీ భార్య వేలిముద్రలుంటాయిగదా?" సందేహంగా అడిగాను. అంతా విని, "ఆ రాక్షసి ముందుగానే జాగ్రత్తపడింది బాబూ! పవిట చెంగుతో గొడ్డలికర్ర పట్టుకుని ఆ పని చేసింది. నేను భయంతో ఆ విషయాన్ని గమనించలేకపోయాను" కసిగా అన్నాడు సూరి.

"మరి నీకు ఈ విషయమంతా ఎవరు చెప్పారు?" ఏదో తెలియని ఆకాంక్షతో అడిగాను.

"నేను లాకప్‌లో వున్నప్పుడు, సతీష్ మనసు మార్చుకొని జరిగిన విషయం చెప్పాడు. అతని కథకు, నా కథ జోడిస్తే యిప్పుడు మీరు విన్న కథ అవుతుంది" మెల్లగా అన్నాడు.



రాధ చాల చక్కగా సూరిని మోసగించింది అనుకొన్నాను.

"....కుడి ఎడమల....దగా....దగా...." శ్రీశ్రీ గారు జ్ఞాపకం వచ్చారు

—ప్రసాద్